ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో....?

బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు, పాఠశాల సిబ్బంది



విశాలాంధ్ర-తెర్లాం: మండలంలోని చీకటిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో విద్యార్థులు, సిబ్బంది ఈ భవనంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. ఈ భవనం ఎప్పుడు కుప్పకూలుతుందో నని వారు ఆందోళన చెందుతున్నారు. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయంపై హెచ్ఎం కే.జగన్నాధంను విశాలాంధ్ర విలేకరి వివరణ కోరగా... నాడు-నేడు నిధులు ఈ స్కూల్‌కు మంజూరు కాలేదని, చేసేదేమిలేక తప్పని పిరిస్థితుల్లో తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడపాల్సివస్తోందన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి మంత్రి బొత్స దంపతుల ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం చీపురుపల్లిలో వెలసిన ఉత్తరాంధ్ర కల్పవల్లి ఇలవేల్పు శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి అమ్మవారి 26వ జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ కార్యదర్శి శ్రీనివాస్ ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరావు ఆలయ కమిటీ మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులకు. బొత్స సందీప్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణమును పరిశీలించారు. కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లం చంద్రశేఖర్ ఎంపీపీ ఇప్పిలి వెంకట నరసింహ జడ్పిటిసి వల్లి రెడ్డి శిరీష ఏఎంసి చైర్మన్ దన్నాన జనార్ధన్ రావు చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి చీపురుపల్లి మండలంలోగల పలు సర్పంచ్లు ఎంపీటీసీలు కార్యకర్తలు మేరకు ముదద మండల నాయకులు తాడే వేణుగోపాలరావు ఎస్వీ రమణరాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

శ్రీ ఎల్లమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్

విశాలాంధ్ర-విజయనగరం : సిరుల తల్లిగా ప్రఖ్యాతి గాంచిన శ్రీ ఎల్లమ్మ తల్లి అమ్మవారిని శ్రీకాకుళం, పార్వతీ పురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ సోమవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయనగరం సంగీత కళాశాల సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ ఎల్లమాంబ సేవ సంఘం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు అక్కడికి చేరుకున్న అవనాపు విక్రమ్ కు కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం, ప్రత్యేక పూజలు చేయించి, తీర్ధ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్ మాట్లాడుతూ గ్రామదేవతల పండగలు మన సంస్కృతిలో భాగం అన్నారు. ప్రతీ ఏటా శివరాత్రి తరువాత వచ్చే అష్టమి నాడు శ్రీ ఎల్లమ్మ తల్లి జాతర నిర్వహించడమే సంప్రదాయాన్ని ఆలయ నిర్వాహక కమిటీ, పూజారుల బృందం కొనసాగించడం అనందదాయకం అన్నారు. ఆలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించడంతో పాటు, భక్తుల సౌకర్యార్ధం క్యూలైన్లు ఏర్పాటు చేసిన ఆలయ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాలి, ప్రసాద్, శ్యామ్, శ్రీనివాస్, రమణ,సతీష్, పూజారుల బృంద సభ్యులు రాంపైడి, సత్యనారాయణ, జొన్నగుడ్డి యువత, పెద్దలు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్ విద్యార్థికి ఆల్ ఇండియా ర్యాంక్ 11

విశాలాంధ్ర -డెంకాడ: ఎం.వి.జి.ఆర్‌లో ఈ.సి.ఈ చివరి సంవత్సరం చదువు తున్న విద్యార్థి, రాకేష్ అందవరపు, ఇటీవల ప్రకటించిన గేట్ 2024 ఫలితాల్లో ఆల్ ఇండియా ర్యాంక్ 11ని సాధించాడు. ఆల్ ఇండియా ర్యాంక్ 11 సాధించినందుకు సంతోషంగా ఉందని, తనకు ఎంతో మద్దతుగా నిలిచిన తల్లిదండ్రులకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నానని రాకేష్ తెలిపారు. అతను తన ప్రయాణంలో తనకు మార్గనిర్దేశం చేసిన ఎం.వి.జి.ఆర్ ఈ.సి.ఈ అధ్యాపకులకు ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపాడు మరియు అతను పెద్ద విజయాలు సాధించగలడని మరియు గేట్ పరీక్షలో బాగా రాణించగలడనే నమ్మకం కలిగించారని పేర్కొన్నాడు. ఐఐటి ఎన్ఐటి పీ.జీ అడ్మిషన్ మరియు పీ.ఎస్.యు ఉద్యోగాలు పొందడం కోసం ప్రతి సంవత్సరం ఐఐటి సంస్థలు గేట్ పరీక్షను నిర్వహిస్తాయని మరియు లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని, కానీ ఈ సంవత్సరం గేట్ పరీక్షలో, ఎం.వి.జి.ఆర్ ఈ.సి.ఈ విద్యార్థి, రాకేష్ ఆల్ ఇండియా ర్యాంక్ 11 సాధించడంలో గొప్ప మైలురాయిని సాధించాడని, అది అతని కృషి, అభిరుచి మరియు అంకితభావాన్ని చూపుతుందని ఎం.వి.జి.ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీ.సీతారామ రాజు తన సంతోషాన్ని వ్యక్తం చేసారు. ప్రతి సంవత్సరం, ఎం.వి.జి.ఆర్ విద్యార్థులు మంచి గేట్ ర్యాంక్‌లను సాధిస్తూ వివిధ ఐఐటి & ఎన్ఐటి ప్రవేశం పొందుతున్నారని, అయితే ఈ సంవత్సరం రాకేష్ ఏఐఆర్ 11ని పొందడం ఎం.వి.జి.ఆర్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని ఎం.వి.జి.ఆర్ ప్రిన్సిపాల్ డా. ఆర్. రమేష్ తన ఆనందం పంచుకున్నారు. వైస్-ప్రిన్సిపాల్, డా. వై.ఎం.సి శేఖర్ ఈ.సి.ఈ హెచ్.ఓ.డీ, ఎస్.కె.. మస్తాన్ వలీ రాకేష్ అద్భుతమైన విజయానికి అభినందనలు తెలిపారు.

రైలుపట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

విశాలాంధ్ర-కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం దాటాక కంటకాపల్లి రైల్వేస్టేషన్‌కి సమీప దూరంలో పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ట్లు రైల్వే పోలీసు అదికారి ఏఎస్ఐకెయం రావు తెలిపారు. సోమవారం స్థానికులు అందించిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని విజయనగరం జిఆర్పీకి అప్పగించామని తెలిపారు. రైలునుండి జారిపడినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగింపు

త్రీ మేన్ కమిటీ ఉత్తర్వులు అందజేసిన హెచ్ఎం

నిర్వాహకులకు అందజేసిన ఉత్తర్వులు కాపీ

విశాలాంధ్ర-జామి: మండలంలోని అన్నం రాజుపేట పంచాయతీ పరిధిలోని సీతానగరం ప్రభుత్వ యుపి పాఠశాలలో గత 20 ఏళ్ళగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులను పాఠశాల హెచ్ఎం సోమవారం తొలగించారు. గతకొద్ది రోజులుగా ఈపాఠశాలలో నిర్వాహ కుల మధ్య వివాదాలు నడిచాయి. చివరకు కొద్దిరోజుల క్రితమే అంతా సద్దుమణిగిందని అందరూ భావిస్తున్న తరుణంలో సోమవారం ఉదయం ఏజన్సీని రద్దు చేస్తున్నామని, రేపటినుంచి మీరు రావద్దని హెచ్ఎం శ్రీనివాసరావు నిర్వాహకులకు చెప్పడంతో వారు అవాక్కయ్యారు. అలాగే వారిని తొలగిస్తున్నట్లుగా తహశీల్దార్, ఎంపిడివో, ఎంఇవో సంతకాలుతో కూడిన ఉత్తర్వులు కాపీలను వారికి అందజేసారు. అయితే సదరు ఉత్తర్వులలో తల్లిదండ్రుల కమిటీ సూచన మేరకు చర్యలు తీసుకోవాలని చెప్పామని, నిర్వాహకులను తొలగిస్తున్నట్లుగా తెలియజేయలేదని ఎంఇవో కె. గంగరాజు చెప్పడం విశేషం. ఇదిలా వుండగా ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఇలా ఏజెన్సీని రద్దు చేయవచ్చా..అనేది అధికారులు తేల్చాల్సి ఉంది. ఇది తప్పయితే తగిన చర్యలు తీసుకుంటారో లేక వదిలేస్తారో వేచి చూద్దాం..

కంట్రోల్ రూం క్రమబద్ధంగా పనిచేయాలి

-కాల్ సెంటర్ కు వచ్చిన వినతులపై తక్షణచర్యలు ఉండాలి

- కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్న వారంతా క్రమబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కంట్రోల్ రూమ్ ను సందర్శించి అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఎలాంటి కాల్స్ వస్తున్నదీ, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని వాటిపై ఆరా తీశారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన ల్యాండ్ లైన్ నెంబర్ల వద్ద నిత్యం కాల్స్ కు హాజరుకావాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లో నున్న 08922-797120, 08922-797124 నెంబర్లకు మోడల్ కోడ్ ఉల్లంఘనపై అందిన ఫిర్యాదులను రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ కు కంట్రోల్ రూమ్ ఇంచార్జ్ మరియు సి పి ఓ బాలాజీ, సోషల్ మీడియా ఇంచార్జ్ మరియు హౌజింగ్ పిడి శ్రీనివాస రావు కంట్రోల్ రూమ్ లో చేస్తున్న విధులను వివరించారు.

గిరిజన సంఘం నేతపై దాడి చేసిన హెచ్ఎం, ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలి

- తీవ్రంగా ఖండించిన సీపీఎం జిల్లా నేతలు

- ఎంఈఓ నరసింగరావుకి వినతిపత్రం సమర్పించిన నేతలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు జరత గౌరీష్ పై దాడి చేసిన ఎస్.కోట మండలం, పల్లపుదుంగాడ మండల పరిషత్ పాఠశాల హెచ్.ఎం, ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శృంగవరపుకోట ఎంఈఓ బి.నరసింగరావుకి సిపిఎం పార్టీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. అలాగే ఈ సంఘటనను ఖండిస్తూ గిరిజన సంఘం నేత జరత గౌరీష్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ తదితరులు మాట్లాడుతూ జరత గౌరీష్ గతంలో ఎస్ఎఫ్ఐ మాజీ నేత. ఇప్పుడు ప్రస్తుతం గిరిజన సంఘం బాధ్యతలు చూస్తున్నారని, గౌరీష్ ఇటీవల విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండల పరిధి దారపర్తి పంచాయతి పల్లపు దుంగాడ పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కాకుండా ప్రైవేటు వ్యక్తిని నియమించి ఆ వ్యక్తికి తలో కొంత ముట్టజెప్పి గిరిజన విద్యార్థిని విద్యార్థులకు శాశ్వతంగా విద్యను దూరం చేస్తున్నారు. ఇది ఒకటే కాదు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ప్రతినెల వేలాది రూపాయలు జీతభత్యాలు రూపంలో తీసుకున్న వీరు ఈ విషయాన్ని స్థానికుడైన ఓ గిరిజన వ్యక్తి.. గిరిజన హక్కులకై పోరాటం చేస్తున్న వ్యక్తి ఉపాధ్యాయుల దుర్మార్గాన్ని నిలదీశారని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడనే అక్కసుతో పాఠశాల హెచ్ఎం తన భర్తను తీసుకొచ్చి గిరిజన నేత గౌరీష్ పై దాడి చేయించటం భావ్యం కాదని ఖండించారు. భార్యా భర్తలు ఇద్దరు భౌతికదాడికి దిగారని, దీనిపై ఈరోజు మండల విద్యాశాఖ అధికారికి, శృంగవరపుకోట పోలీస్ అధికారికి ఫిర్యాదు చేసారు. ఇది ఎంతటి దుర్మార్గం అంటే ఇది ఓ పక్క కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఎన్ ఈ పి నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ విధానాల వలన డ్రాప్ అవుట్ లు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. గిరిజన గ్రామాల్లో ఉన్న పాఠశాలలో అన్ని అర్హతలు పొంది ఉపాధ్యాయులుగా నియమితులైన వారు పాఠాలు పిల్లలకు అర్థమైనట్టుగా చదువు చెప్పగలుగుతారన్నారు. ఏ రకంగా ఉపాధ్యాయులుగా అర్హత లేని వాళ్ళతో పాఠాలు చెప్పించి గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఆదిలోనే చదువుకు దూరం చేయాలనే దుర్మార్గంతో ఈ ఉపాధ్యాయులు నడుచుకున్నారని, ఇటువంటి ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ మండల విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘ నాయకుడిపై దాడికి దిగిన ఇద్దరు పైన చర్యలు తీసుకుని ఉపాధ్యాయ వృత్తికే అవమానం చేకూరుస్తున్నటువంటి ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేయాలని, లేనిపక్షంలో ఏపీ గిరిజన సంఘం, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానికులను కలుపుకొని ఈ దుర్మార్గంపై పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేపడుతాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రమసాల శివ, సిపిఎం పార్టీ సభ్యులు చెలికాని ముత్యాలు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

అఖిల భారత విద్యార్థి సమైక్య డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు యాజమాన్యాలు విచ్చలవిడిగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు పై తగు చర్యలు చేపట్టాలని అఖిల భారత విద్యార్థి సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ మాట్లాడుతూ స్థానిక కేంద్రంలో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలు మరియు ప్రచార వాహనాలను వెంటనే అడ్డుకోవాలని, ఫ్లెక్సీలు తొలగించాలని కోరారు. ఎన్నోసార్లు ప్రచారాలకు ప్రాధాన్యత ఇవ్వవద్దని చెప్పిన,ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నాయని అటువంటి విద్యాసంస్థలపై చట్టపరి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూన్ వరకు అడ్మిషన్స్ గాని ప్రచార క్యాంపెయిన్ గాని ఫ్లెక్సీలుగాని ఏర్పాటు చేయ కూడదని నిబంధనలు ఉన్నప్పటికీ,ఆ నిబంధనను విద్యా సంస్థలు మరి కోచింగ్ సెంటర్లు పాటించకుండా తల్లిదండ్రులు మోసం చేసే పద్ధతుల్లో ఇప్పటి నుంచే ఆకర్షనీయమైనటువంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వేలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రులు నుంచి గుంజడానికి ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు.తక్షణమే పర్మిషన్ లేని విద్యాసంస్థల యాజమాన్యాలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.లేనియెడల ఏఐఎస్ఎఫ్ ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి హరికృష్ణ మరియు నాయకులు పోలరాజు మరియు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

19, 20 తేదీలలో జాకేరులో శ్రీరామాలయ 10వ వార్షికోత్సవం

19న భక్తి పారవశ్యంగా జరగనున్న బైటో భజన కార్యక్రమం

20న ఉదయం మహిళా కోలాటాలు ,అన్నసమారాధన

స్వామివారి కల్యాణం, ఊరేగింపు, ప్రత్యేక ఆకర్షణగా కేరళ డ్రమ్స్

సాయంత్రం 4గంటల నుంచి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు

సాయంత్రం6నుంచి పల్సర్ బైక్ ఝాన్సీ బృందంచే డాన్స్ బేబీ డాన్స్



విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో శ్రీరామాలయ10వ వార్షికోత్సవ వేడుకలు మంగళ,బుధవారాల్లో వేడుకగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం రాత్రి 7గంటల నుంచి బైటో భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. అలాగే బుధవారం ఉదయం 8గంటలు నుంచి పలు మహిళా బృందాలచే మహిళా కోలాటాల ప్రదర్శనలు కదురమణీయంగా జరుగుతాయి.అలాగే మధ్యాహ్నం 12గంటల నుంచి భారీ ఎత్తున అన్నసమారాధన జరగనుంది. అలాగే స్వామి వారి ఊరేగింపు,సీతారాముల కళ్యాణం, ప్రత్యేక ఆకర్షణగా కేరళ డ్రమ్స్ వాయిద్యాలు వుంటాయి.సాయంత్రం 4గంటల నుంచి ఎడ్ల బండ్లపోటీలు జరుగుతాయి. అదేరోజు సాయంత్రం 6గంటల నుంచి విశాఖ రమేష్ ఎంటర్ ట్రైనర్స్ , పల్సర్ బైక్ ఝాన్సీ టీమ్,బాలు రైడర్స్ వారిచే టీవి సీరియల్ ప్రేమ్ యాంకర్ ప్రసన్న భలే ఛాన్స్ రమేష్ మాస్టర్, యాంకర్ రేష్మ అండ్ టీమ్ చే కడు రమ్యంగా డాన్స్ బేబీ డాన్స్ నృత్య ప్రదర్శనలుఏర్పాటు చేసారు. రెండు రోజుల పాటు జరిగే ఈ తీర్థ మహోత్సవం లో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని ప్రసాదాలను స్వీకరించాలని గ్రామ సర్పంచ్ బుద్ద చిన్నమ్మలు అప్పల నాయుడు దంపతులు కోరారు.

పాత బగ్గాంలో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

విశాలాంధ్ర-గజపతినగరం: మండలం లోని పాత బగ్గాం గ్రామంలో సోమ వారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. రైతు లోగీశ సూర్యనారాయణ ట్రాక్టర్ పై గడ్డిని తీసుకువెళ్తుండగా విద్యుత్ వైర్లు గడ్డికి తగిలి షార్ట్ సర్క్యూట్ జరగడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రెండు లక్షల ఆస్తి నష్టం సంభ వించిందని గ్రామంలో ఎటువంటి నష్టం జరగకుండా టాక్టర్ ను చెరువు వద్దకు తీసుకువెళ్లారు. అగ్నిమాపక కేంద్రం అధికారి రవిప్రసాద్ సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేశారు.

పొత్తు ఓకే... పొంతన కుదిరేనా....?

అయోమయంలో టిడిపి కార్యకర్తలు

ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ప్రత్యర్థి బడుకొండ

విశాలాంధ్ర-పూసపాటిరేగ: తెలుగుదేశం పార్టీకి జనసేనకి మధ్య రాష్ట్ర స్థాయిలో పొత్తుకుదిరింది కానీ స్థానికంగా నెల్లిమర్ల నియోజకవర్గంలో మాత్రం నాయకులు మధ్య పొంతన కుదరడం లేదు. ఈ పరిస్థితిని చూసి సామాన్య ఓటర్ నుంచి పెద్ద స్థాయి కార్యకర్తల వరకు అయోమయంలో పడ్డారు. ఇదే పరిస్థితిలో ఇంకొంత కాలం గడిస్తే పొత్తులో భాగంగా తెచ్చుకున్న సీటు ఓటమి పాలయ్యే ప్రమాదం ఉందని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటారు. జనసేన మాధవి కి సీటు ప్రకటించిన అప్పటినుంచి, అప్పటివరకు టిడిపి సీటు నాదే అనుకున్నా టీడీపీ నెల్లిమర్ల ఇంచార్జ్ కర్రోత్ బంగార్రాజు కొంత స్తబ్దత చెంది. పార్టీ వ్యవహారాల్లో చురుకుదనం తగ్గించినట్టుగా కార్యకర్తలు మాట్లాడుకుంటున్నారు. ఎమ్మెల్యేగా టికెట్ ఇవ్వకపోయినప్పటికీ అధిష్టానం నుంచి ఏదో ఒక పదవికి హామీ తెచ్చుకునేందుకు అతను తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు అలా ఏదో ఒక హామీ వస్తే గాని అతని వర్గం నుండి జనసేనకు పూర్తి మద్దతు ఉండకపోవచ్చని టిడిపి శ్రేణులు భావిస్తున్నారు. టిడిపిలో ఏడుసార్లుగా నియోజవర్గంలో విజయపతాకం ఎగరవేసిన పతివాడ నారాయణ స్వామినాయుడు వర్గం మాత్రం జనసేనకు అధిష్టానం ఆదేశం మేరకు చెయ్యకు తప్పదని భావిస్తుంది. ఇందులో భాగంగానే టిడిపి ఆవిర్భావం నుంచి టీడీపీకి కంచుకోటగా ఉన్న భోగాపురం, నెల్లిమర్ల నియోజక వర్గం ఈరోజు పార్టీ గుర్తు లేకుండా పోటీ చేయవలసి వస్తుందని కార్యకర్తలు మదనపడుతున్నారు. అయితే పొత్తులో భాగంగా టిక్కెట్లు దక్కించుకున్న జనసేన మాధవి ఇప్పటికీ ఒకే జెండా తోటే తిరుగుతుందని టిడిపి కార్యకర్తలు గానీ టిడిపి నాయకులు గాని కలుపుకునే ప్రయత్నం చెయ్యట్లేదని టిడిపి నాయకులు కొందరు కోపంగా ఉన్నారు. ఆమె కార్పొరేట్ విధానాలు మానుకొని రాజకీయ విధానాలు అనుభవ నాయకులు సూచనలతో ముందుకు వెళ్లాలని లేనిపక్షంలో ప్రజల్లో వ్యతిరేకత ఉన్నప్పటికీ స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు బలమైన ప్రత్యర్థి. కుల ప్రాతిపదికను గాని ఎత్తుకు పైఎత్తులు వేస్తూ జనాల ఆకర్షించడంలో గాని అతడు సిద్ధహస్తుడవడంతో ఈ పొత్తుల కుమ్ములాటలో ఏ మాత్రం తప్పులు దొర్లిన ప్రత్యర్థికి అత్యధిక గెలుపుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని టిడిపి వర్గాలు ఆలోచన చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం పై కొంత , బడుకొండపై

మరికొంత వ్యతిరేకత ఉండటంతో కొన్ని వర్గాల వారు వైసీపీని విడిచి జనసేనలో కి మారుతున్న తరుణంలో అదే తమ గెలుపుకు సరిపోతుందని బలమైన ఓటు బ్యాంకు ఉన్న టిడిపి ని నిర్లక్ష్యం చేస్తే దారుణమైన ఓటమి తప్పదని నెల్లిమర్ల నియోజకవర్గం ప్రజలు చర్చించు కుంటున్నారు. నాలుగు మండలాల టిడిపి నాయకులను కార్యకర్తలను జనసేన అభిమానులు ఒకే తాటిపైకి తేవడానికి ఉమ్మడి అభ్యర్థి ఏ విధమైన విధానాల అవలంబిస్తుందో ఈ లోటుని ఏ విధంగా పూరిస్తుందో వేచి చూడాలి మరి.

ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర-మెరకముడిదాం : జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారిని రాణి సూచనలతో మెరకముడిదాం ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ అజిత్ బాబు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవ వారోత్సవములో భాగంగా డాక్టర్ అజిత్ బాబు మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా ఆశా వర్కర్లు ద్వారా క్షయ వ్యాధి ఆరు నెలల వరకు మందులు పంపిణీ తో పాటుగా వ్యాధిగ్రస్తులకు ఆన్లైన్ పద్ధతిలో నెలకు 500 రూపాయలు చొప్పున ఇవ్వడం జరుగుతుందని తెలియపరచడం జరిగింది. బాడింగి టీబీ యూనిట్ సంబంధించిన పర్యవేక్షులు బి రమేష్ స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా పౌష్టిక ఆహారం ఉచితంగా టీబి వ్యాధిగ్రస్తులకు ఇవ్వడం జరుగుతుందని అలాగే క్రమం తప్పకుండా టీబీ వ్యాధిగ్రస్తులు మందులు సక్రమంగా వేసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో బాడంగి యూనిట్ పర్యవేక్షకులు బి రమేష్, సి హెచ్ ఓ రామారావు,హెచ్ వి జయలక్ష్మి, హెచ్ ఎస్ -కె వెంకటాద్రి, హెచ్ ఏ వర్మ, ఎల్ టి బంగారు నాయుడు, ఏఎన్ఎం జ్యోతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ప్రశాంతంగా పది పరీక్షలు

ఎంఈఓ సిహెచ్ కూర్మారావు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1వ పరీక్ష కేంద్రంలోనూ, రెండవ పరీక్ష కేంద్రం ఏపీ ఆదర్శ పాఠశాల లో మొదటి రోజు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ కూర్మా రావు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఒకటి బావ పరీక్ష కేంద్రంలో 225 పరీక్షలు రాయవలసి ఉన్నప్పటికీ ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు ఇక్కడ విద్యార్థుల కొరకు 10 గదులను పరీక్షలు రాయడానికి కేటాయించారని తెలిపారు 2వ కేంద్రమైన ఏపీ ఆదర్శ పాఠశాలలో 290 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి 12 గదులు కేటాయించడం జరిగిందని ఇక్కడ ఎవరూ గైర్హాజరు కాలేదని తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం..ఇద్దరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర -శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు గా గల శ్రీనివాస కోలనీలో ఒక నల్లని పిచ్చి కుక్క సోమవారం స్వైర విహారం చేసి ఇద్దరు చిన్నారులను కరిచింది. హృషీకేశ్(10) అనే విద్యార్థి పాఠశాలకు వెళ్ళేందుకు చెప్పుల బెల్టు పెట్టుకుంటుండగా అకస్మాత్తుగా పిచ్చి కుక్క దాడిచేసి కుడి మోకాలికి ఎగువన, ఎడమ చూపుడు వేలి పైన కరవడముతో రక్తస్రావమయింది. అప్పుడే పాఠశాల వాహనం దిగి తన యింటిలోకి ప్రవేశిస్తున్న నేహ(7)ను పిచ్చికుక్క కరవడముతో ఆ పాప కుడి కాలుపై అంగుళం మేర గాటుపడి తీవ్ర రక్తస్రావము జరిగింది. ఆ పాప తల్లి దంత వైద్యురాలు కావడముతో తన క్లినిక్ లోనే ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం కమ్యూనిటీ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఆసుపత్రిలో వీరికి వైద్యం చేసి యింటికి పంపారు.

మద్యం అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర -భోగాపురం: మండలంలో గూడెపు వలస గ్రామానికి చెందిన కొండపు రామునాయుడు ఇంటి అవరణలో మద్యం అమ్ముతుండగా పట్టుబడినట్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ.రవికుమార్ తెలిపారు. ఇతని వద్ద నుంచి 90 క్వార్టర్ విస్కీ సీసాలు, 12 బీర్లు స్వాధీనం చేసుకొన్నామన్నారు. అతనిని అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసి రిమాండ్ నిమిత్తం ఎక్సైజ్ కోర్టు ఎదుట హాజరు పరిచా మని తెలిపారు.

ఆసుపత్రి నిర్వహణలో వెలుగు చూసిన నిర్లక్ష్యం

విశాలాంధ్ర -శృంగవరపుకోట : పిచ్చి కుక్క కరిచిన వెంటనే నేరుగా తన కుమారుడిని ఆసుపత్రికి తీసుకువచ్చిన తండ్రికి సవాళ్ళు ఎదురయ్యాయి. సోమ వారం ఓపి చీటి పొంది వైద్యుడిని సంప్రదించగా గాయాలను వెంటనే డెట్టాల్ లేదా సబ్బుతోను కడిగి శుభ్రపరిచి రమ్మని, లేకపోతే వైరస్ శరీరమంతా వ్యాపిస్తుందని సూచించారు. పలువురు సిబ్బందిని వాకబు చేసి మరుగు దొడ్డి వద్ద మరియు బయట సామానులు శుభ్రపరిచే చోట నీటికోసం ప్రయత్నించగా ఎక్కడా కొళాయిల నుండి చుక్క నీరు రాలేదు. విషయాన్ని పారిశుద్ధ్య సిబ్బందికి తెలియపరచగా సంబంధిత సిబ్బంది రాలేదని చెప్పారు. ఆ తండ్రి నీరు అవసరమని ఏ రోగికయినా, సందర్శకులకయినా కనీస అవసరమని వెంటనే మోటారు స్విచ్ వేయమని సిబ్బందిని కోరి అరగంట ఎదురుచూసారు. నీరు రాకపోవడంతో తన కుమారుడిని తిరిగి ఇంటికి తీసుకొని వెళ్ళి గాయాలను సబ్బుతో శుభ్రంగా కడిగి మరల ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఈ నిరీక్షణలో గంటకు పైగా సమయం గడిచింది. మరల గాయాల నుండి రక్తం స్రవించడముతో శుభ్రపరిచేందుకు ఏ కొళాయి దగ్గరకు వెళ్ళినా నీటి జాడలేకపోవడముతో ఏమీ చేయలేకపోయానని ఆ తండ్రి నిర్ఘాంతపోయారు. రోగులు, సందర్శకుల కనీస అవసరాల విషయంలో ఆసుపత్రి నిర్వాహకులు చాలా నిర్లక్ష్యంగా ఉండడాన్ని తీవ్రం గా ఖండిస్తున్నానని, ఉన్నత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళతానన్నారు. నాలుగు ట్యాంకులు నిండితే గాని నీరు కొళాయిల నుండి రాదని సిబ్బంది స్వయంగా చెప్పారని, ఇలాంటి పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే ఆసుపత్రి లోని రోగులు, వారి సహాయకులు, సందర్శకులు, ఆసుపత్రి వైద్యులు, సహాయక సిబ్బంది ప్రాణాల పరిస్థితి ఏమిటని పత్రికా ముఖంగా మానవ హక్కుల న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ ప్రశ్నిస్తున్నారు.

ఎల్లారమ్మ జాతర ఆదాయం రూ.19.98 లక్షలు



విశాలాంధ్ర-జామి: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దేవత జామి శ్రీఎల్లారమ్మ తల్లికి ఈఏడాది జాతరలో హుండీలు, విరాళాల ద్వారా రూ.19,98,401 ఆదాయం వచ్చింది. సోమ వారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఇవో ప్రసాదరావు, దేవాదాయసిబ్బంది, శ్రీవారి సేవకులు సహకారంతో హుండీల లెక్కింపు చేపట్టారు. గ్రామ ఉపసర్పంచ్, ఉత్సవ నిర్వాహకురాలు అల్లు పద్మ , పోలీసుల సమక్షంలో లెక్కింపును చేశారు. గతేడాది హుండీల ద్వారా రూ.19,57,476లు వచ్చాయని, ఈఏడాది అదనంగా మరో రూ.40,925లు పెరిగినట్లుగా ఇవో ప్రసాదరావు తెలిపారు. మొత్తం నగదును దేవాదాయ నిభందనల ప్రకారం స్థానిక ఎస్‌బిఐలో జమ చేసారు. ఈజాతరలో భక్తులనుంచి ఎటువంటి బంగారం, ఇతర వస్తువులు రాలేదని అధికారులు తెలిపారు.

ప్రారంభమైన పది పరీక్షలు

730 మంది విద్యార్థులు హాజరు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలుకు 751 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 730 మంది మాత్రమే హాజరు అయ్యారు. మెరకముడిదాంలో రెండు సెంటర్లో, గర్భా%శీ% లో రెండు సెంటర్లో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బుదరాయవలస పోలీస్ సిబ్బంది 144 సెక్షన్ విధించారు. నాలుగు కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు జరగటంతో సిబ్బంది ఊపిరి పీల్చు కున్నారు.

జోరుగా బడుకొండ అప్పలనాయుడు ప్రచారం

విశాలాంధ్ర-పూసపాటి రేగ: నెల్లిమర్ల నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే సీటు సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన బడుకొండ అప్పలనాయుడు కి అధిష్టానం ప్రకటించిన దగ్గర నుండి ఎన్నికల ప్రచార బరిలోకి దిగిన ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు. సోమవారం ఉదయం మండలంలో చోడమ్మ అగ్రహారం పంచాయితీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భాగంగా గ్రామస్తులు ఆయనకు డప్పులతో, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి ఇంటిని, కలిసిన ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను మళ్ళీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు తో పాటు. ఎమ్మెల్సీ సురేష్ బాబు మండల వైసిపి పార్టీ,, మండల వైస్ ఎంపీపీలు అల్లాడి రమేష్, చంటి రాజు, మండల వైసీపీ కార్యకర్తలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ముషిడిపల్లి పంపుహౌస్ వద్ద భారీ టేకు చెట్లు అక్రమంగా నరికివేత..

అనుమతులు లేకుండా కాంట్రాక్టర్ నరికివేయించినట్లు ఆరోపణలు విషయం బయటకు పొక్కడంతో రంగంలోకి దిగిన ఫారెస్ట్ అధికారులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : మండలంలోని తాటిపూడి జలాశయ రహదారిలో మధుపాడ-ముషిడిపల్లి పంపుహౌస్ నుండి విజయనగరం పట్టణానికి తాగునీటి సరఫరా జరుగుతుంది. ఈ పంప్ హౌస వద్ద గల టేకు చెట్లను కాంట్రాక్టర్ రాంప్రసాద్ ఎటు వంటి అనుమతులు తీసుకోకుండా నరికి తరలించే ప్రయత్నంలో విలేకరుల కంట పడటంతో నరికిన టేకు చెట్లను అక్కడే ఉంచారు. కాంట్రాక్టర్ రాంప్రసాద్ ని అడగగా తనకు సంభందం లేదని సమాధానం చెబుతున్నారు. ఇక సంబంధిత అధికారి డి.ఈ అప్పారావుని అడగగా మావద్ద నుంచి ఎటువంటి అనుమతులు ఎవరు తీసుకోలేదని స్పష్టం చేశారు. అటవీశాఖ అధికారి రవి కుమార్ కి సమాచార ఇవ్వడంతో తమ సిబ్బందిని పంపి వాటి కొలతలు తీసుకుని వెళ్లారు. సుమారుగా 5-6 టేకు చెట్లు కొట్టినట్లు గుర్తించారు. కాగా మరికొన్ని చెట్లను తరలించుకు పోయినట్లు చెబుతున్నారు.

స్పందన నిర్వహించాలి

తెలుగుదేశం పార్టీ నాయకులు ఐబీపీ రాజు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలని తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు ఐవిపి రాజు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో విజయనగరం నియోజకవర్గ పార్టీ నాయకులు పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన (గ్రీవెన్స్ సెల్) ను ఎప్పటిలానే నిర్వహించాలని, ప్రజలు వారి సమస్యల కోసం విన్నవించుటకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వైకాపా ప్రభుత్వ కాలంలో అనేక ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎన్నో వినతులను స్పందనలో విజయనగరం తెలుగుదేశం పార్టీ నాయకులు సమర్పిం చారని, ముఖమంత్రి హోదాలో ఉన్న జగన్ అరగంటలో స్పందన సమస్యలను పరిష్కరిం చాలని చెబుతారు కానీ, నేటి వరకు ఆ సమస్యలు పరిష్కారం కాలేదు అన్నారు. గ్రీవెన్స్ లో తెలియజేసిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళీమోహన్, ఆల్తి బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వంలోనే డ్వాక్రా సంఘాల ఏర్పాటు

తెలుగు మహిళా కమిటీ సభ్యులు సువ్వారి అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. టిడిపి ప్రభుత్వంలోని మహిళలలు ఆర్థికంగా అభివృద్ధి చెందారని తెలుగు మహిళా కమిటీ సభ్యులు సువ్వారి అనురాధ బేగం,పత్తిగిల్లి సూర్యకుమారి అన్నారు. తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు నియోజకవర్గ ఇంచార్జ్, తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి విజయనగరం శాసనసభ ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు గారి సూచన మేరకు తెలుగు మహిళా మహిళా సభ్యులు ఆధ్వర్యంలో సోమవారం 48,50 డివిజన్లో "డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించిన సందర్భంగా మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ ని స్థాపించిన తరువాతే మహిళలకు గుర్తింపు వచ్చిందని, మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారని, చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మొట్టమొదటిసారిగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేసారన్నారు, గ్యాస్ కనెక్షన్లు వంటివి ఇచ్చారని తెలిపారు. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా సాధికారత దిశగా తెలుగుదేశం జనసేన పార్టీ లు ఉమ్మడిగా ప్రకటించిన "కలలకు రెక్కలు" అనే సరికొత్త పథకం గురించి చెబుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలకు వృత్తిపరమైన విద్యకు మార్గాలను అందిం చడంతో పాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పిం చడం ఈ పథకం ప్రధాన లక్ష్యం అని వివరించారు. ప్రస్తుత వైకాపా ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు వంటివి విపరీతంగా పెరిగాయని, మహిళలకు రక్షణ కల్పించడం లో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. అందుచేత మహిళలకు రక్షణ కల్పించి వారిని అన్ని రంగాలలో ముందుకు నడిపించే విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అతన్ని ముఖ్యమంత్రిని చేసేందుకు విజయనగరం శాసనసభ అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు గారికి మీరంతా మద్దతు తెలుపుతూ సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా కమిటీ సభ్యులు కంది శమంతకమణి, చింతల వీరలక్ష్మి, పద్మలత, రౌతు పద్మ, సుంకరి సునీత, మణి కుమారి, బేగం తదితరులు పాల్గొన్నారు.

డోకల రాములు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం విజేత విద్యాసంస్థల వ్యవస్థా పకులు, రిటైర్డ్ హెచ్ఎం డోకల రాములు పెద్దకర్మను సోమ వారం పట్టణం సూర్య రెసిడెన్సి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై రాములు మాస్టారు చిత్రపటానికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

23, 24, 25 తేదీల్లో మరుపల్లి ఎల్లమ్మ జాతర

విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామంలో ఈనెల 23 నుండి 25 వరకు ఎల్లమ్మ జాతర నిర్వహించబడును అని గ్రామ సర్పంచ్ లెంక వరలక్ష్మి తెలిపారు భక్తు లెల్లరు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వశాంతి కళ్యాణం

విశాలాంధ్ర-కొత్తవలస: మండలకేంద్రమైన కొత్తవలసలో గల ఆంజనేయ పేట వద్దగల గోవిందమాంబ మహాదేవి సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం విశ్వశాంతి కళ్యాణం వైభవంగా జరిగింది. ఫాల్గుణ మాస శుక్లనవమి ని సంతరించుకుని గోవింద కళ్యాణం కనువిందుగా జరిపించారు. ఉదయంనుండి వీరబ్రహ్మేంద్రస్వామి ని భక్తులు దర్శించుకుని విశ్వకళ్యాన్ని తిలకించారు. లాక్కోజు ఓంకార ఆచార్య సిద్ధాంతి నవ దంపతలతో కళ్యాణ మహోత్సవం కన్నులవిందుగా జరిపించారు. లోకంలో శాంతి కలిగి సకల జీవవరాసులు చల్లగా ఉండాలని కోరారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

66 మంది క్యాటరేక్ట్ ఆపరేషన్లకు ...

విశాలాంధ్ర-వంగర: నవజీవన్ సేవా సంస్థ తిరుపతి డా కే శ్రీధర్ ఆచార్య వారి ఆర్థిక సహాయ సహకారం తో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం వారిచే వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్ వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారుడా"ఎస్ జాక్షన్ 152 మందికి కంటి తనిఖిలు జరపగా వీరిలో 66 మంది ఐ ఓ యల్ క్యాటరెక్ట్ ఆపరేషన్ కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రంలో ముఖ్య అతిధిగా నావజీవన్ ట్రస్ట్ అధ్యక్షులు డా కే ఎస్ ఆచార్య మాట్లాడుతూ వంగరలో గత 19 సంవత్సరాలుగా ఉచిత శిబిరాలు నిర్వహిస్తున్నా మన్నారు మరియు స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సాదేం వెంకటరమణ .శంకర్ ఫౌండేషన్ క్యాంపు ఇంచార్జి సిహెచ్ వెంకటరమణ .వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బెవర ఈశ్వర్‌రావు, పాలకొండ ప్రగతి సొసైటీ అధ్యక్షులు హరి బాబు కొత్తూరు హోలీ క్రాస్ సంస్థ ప్రభుదాస్ స్పందన సభ్యులు బి గణపతి మరియు తూముల యోగేంద్ర ముంజి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం మండలంలో పది పరీక్షలకు 14 మంది గైర్హాజరు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో సోమవారం జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 550 మందికి గాను 536 మంది హాజరయ్యారు. 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలో గల 03 పరీక్షా కేంద్రాల లో ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు వసతులు కల్పించి... పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు తగు చర్యలు తీసుకున్నారు. ఈ 03 పరీక్షా కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహణ జరుగుతుంది. విద్యాశాఖ అధికారి జై త్రినాధరావు మాట్లాడుతూ విలేకరులతో తెలిపారు.

కడకొండలో నేడు, రేపు శ్రీముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

- సారధ్యం వహించనున్న ఆలయ నిర్మాణ ప్రధానదాత చిన్నబ్బినాయుడు
- ముఖ్య అతిథులుగా హాజరు కానున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే డీసీసీబీ చైర్మన్
- ఉత్కంఠతలూగించనున్న ఎడ్ల పరుగు పందాలు

విశాలాంధ్ర -వేపాడ: మండలంలోని వావిల పాడు శివారు కడకొండ గిరిజన గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం నేడు రేపు వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఆలయ నిర్మాణ ప్రధాన దాత గోగాడ జగన్నాథం నాయుడు (చిన్నబ్బి నాయుడు) సారధ్యంలో జరగనున్న విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో ముఖ్యఅతిథులుగా ఎస్ కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే బుదవారం మధ్యాహ్నం 12గంటల నుంచి భారీఎత్తున అన్నసమారాధన జరగనుంది. అదేరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి ఎడ్ల బండ్ల పరుగు పందాలు ఏర్పాటు చేసి నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే బోను సింహాద్రప్పుడు, గండి శ్రీరామ్మూర్తి తదితరుల ఆర్థిక సహకారంతో రాత్రి 8గంటల నుంచి విజయనగరం వారిచే బుర్రకథ ప్రదర్శన వుంటుంది. ఈ గుడి నిర్మాణం కోసం గోగాడ జగన్నాథం నాయుడు రూ 7లక్షల 10వేలు సమకూర్చగా, మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి 30వేలు, ఇరట ఈశ్వరరావు (ఇంజనీరు) లక్ష రూపాయలు, చొక్కాకుల సింహాచలం నాయుడు రూ 16వేలు, చీపురు ఈశ్వరరావు (ప్రిన్సిపాల్) రూ 5వేలు, చీపురు దేముడు (టీచర్) రూ 5వేలు చొప్పున ఆర్థిక సహకారం అందించగా కడకొండ గ్రామప్రజలు రూ. 4లక్షల 50వేలు సమకూర్చారు. అత్యంత వైభవంగా జరగనున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవలసిందిగా గ్రామస్తులు కోరారు.

బేబీనాయన సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన 15 కుటుంబాలు

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం మండ లం నెమలాం గ్రామం నుండి సుమారు 15 కుటుంబాల వారు మంగళవారం బొబ్బిలి కోటలోకి వచ్చి బేబినాయన సమక్షంలో ప్రస్తుత అధికార వైయస్సార్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వీరందరికీ బేబినాయన తెలుగుదేశం పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించడం పార్టీలో చేరిన వారిలో బోనెలరాము, బోనెలశివయ్య, నేతుల.లక్ష్మి, బోనెల సింహాచలం, గుజ్జల దుర్గారావు, గొట్టివాడ రమణ, నేతుల అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి మండలంలో ఎంపీ బెల్లాన ప్రచారం

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం మెట్టపల్లి, అలజంగి, పత్తికాయ వలస లో ఎన్నికల ప్రచారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు) సోమవారం చీపురుపల్లి మండలం మెట్టపల్లి, పత్తికాయవలస, అలజంగిలో ఎన్నికల ప్రచార ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొని చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ (సత్తిబాబు) ను విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు) అను నేను వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఫ్యాన్ గుర్తుపై పోటీ చేయుచున్నాం కావున అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని బెల్లాన కోరారు. కార్యక్రమంలో చీపురుపల్లి మండల పార్టీ నాయ కులు ఇప్పిలి అనంతం,వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, మీసాల వరహాల నాయుడు,పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం : మండలంలోని కాగితవలస పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం తనిఖీ చేశారు. జిల్లాపరిషత్ ఉన్నత పాటశాలలో ఉన్న ఈ పోలింగ్ కేంద్రంలో కనీస వసతులను తనిఖీ చేశారు. అక్కడి ఓటర్ల సంఖ్య, ఇతర సమస్యలపై ఆరా తీశారు. ఓటర్లకు పోలింగ్ రోజు ఎండ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రహరీ గోడ లేని పోలింగ్ బూత్ లకు చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో త్రాగు నీరు, విద్యుత్ సౌకర్యం, నేమ్ బోర్డులు, మరుగుదొడ్లు, ర్యాంప్ లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.ఈ తనిఖిలో జిల్లా ఎస్పీ దీపిక, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్డీవో బి. శాంతి, నియోజకవర్గ ఆర్వో జోసెఫ్, తహశీల్దార్ జె.రాములమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మలేరియాపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పునచ్చరణ తరగతులు

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం జిల్లా వైద్య& ఆరోగ్య శాఖాధికారి వారి కార్యాలయం సమావేశ మందిరంలో మలేరియా సర్వేలర్స్ ను బలోపేతం చేయుటకు ప్రాధమిక ఆరోగ్యకేంద్రాల్లో మలేరియా ప్రభావిత ఉపకేంద్రాలలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ (మగ) లకు రెండు రోజుల పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శిక్షణా తరగతులను సోమవారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్. భాస్కర రావు ప్రారంభించారు. క్షేత్ర స్థాయి పర్యటన సక్రమంగా నిర్వహించి జ్వరపీడు తులకు రక్త పూతలను సేకరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మనీ , జోనల్ మలేరియా అధికారి డా. శాంతి ప్రభ, అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.ఎస్. ప్రసాదరావు, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

చండీయాగంలో మంత్రి బొత్స కుటుంబీకులు

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఎంపీ నివాసంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్(పెదబాబు) నివాసంలో సోమవారం ఉదయం నిర్వహించిన రాజ్యశ్యామాల చండీయాగం రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ (సత్తిబాబు), మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చీపురుపల్లిలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ (పెదబాబు) నివాసంలో నిర్వహించిన రాజ్యశ్యామల దేవి అమ్మవారి చండీయాగం లో పలువురు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి — కలెక్టర్ నాగలక్ష్మి

లక్ష్మీపేటలో అవగాహనా సదస్సు

గ్రామంలో పర్యటించి ఓటర్లకు భరోసా నిచ్చిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర-వంగర-విజయనగరం: ఓటర్లు తమ ఓటుహక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. అతి సున్నిత ప్రాంతంగా గుర్తింపు పొందిన వంగర మండలం కె.లక్ష్మీపేటలో ఓటర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుల్లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పి దీపిక పాల్గొని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడంలో జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామంలో పర్యటించి ప్రజలకు భరోసానిచ్చారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించారు. అవగాహనా సదస్సులో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ప్రతీఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. అందుకు తగిన వాతావరణాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. గతంలో జరిగిన సంఘటనలను పునరావృతం కానీయమని హామీ ఇచ్చారు. ఓటర్లు ఎటువంటి భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతీఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకొనే వాతావరణాన్ని కల్పిస్తున్నామని అన్నారు. శతశాతం తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కుల,మత, పేద, దనిక, స్త్రీపురుష బేధాల్లేకుండా అందరికీ మన రాజ్యాంగం ప్రకారం సమాన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేం దుకు బూత్ స్థాయి అవగాహనా గ్రూపులను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే ప్రతీ పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టార్ అధికారిని, పోలీసు శాఖ నుంచి కూడా మరో సెక్టార్ అధికారిని నియమించామని తెలిపారు. ఓటు వేయడంలో తమకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే ఈ గ్రూపు సభ్యులకు, సెక్టార్ అధికారులకు లేదా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని 85 ఏళ్లు పైబడ్డ వృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటివద్దనే ఓటుహక్కును వినియోగించే అవకాశాన్ని ఈ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ కల్పించిందని చెప్పారు. ముందుగా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునని కలెక్టర్ సూచించారు. చిన్నపిల్లల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అంగన్వాడీ కార్యకర్తల చేత క్రష్ లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పి దీపిక మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అనుగుణమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఓటర్లకు ధైర్యాన్ని, భరోసాను కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో పోలీసు కవాతును నిర్వహిస్తున్నామన్నారు. ఓటు వేయడంలో ఏమైనా సమస్యలు ఎదురవుతాయని భావిస్తే, నిర్భయంగా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. గత ఎన్నికలో జరిగిన వివాదాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలను చేపట్టామన్నారు. దీనిలో భాగంగా కొందరిని బైండోవర్ కూడా చేశామన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తామని, దీనిపై ఎటువంటి సందేహాలు పెట్టుకోకుండా, ప్రతీ ఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్పి కోరారు. ఈ సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, నియోజకవర్గ ఆర్వో జోసెఫ్, ఆర్డిఓ బి. శాంతి, డిఎస్పి చక్రవర్తి, సిఐ శ్రీనివాస్, తాశిల్దార్ టి.చిరంజీవులు పడాల్, సెక్టార్ అధికారులు, ఎన్నికల డిటిలు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, బిఎల్ఓలు పాల్గొన్నారు.